సాక్షి చిత్తూరు

మంగళవారం, 21, మే, 2024



'ఉపాధి'.. పేదల పెన్నిధి

జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద పనులు జోరుగా సాగుతున్నాయి. నకాలంలో కూలి అందుతోంది. - 8లో



గాలివానతో అప్రమత్తం

జిల్లాలో వర్షాలు కురుస్తున్నందున పిడుగులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. - 8లో



అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

ఇసుక రీచ్‌లకు అనుమతి గడువు పూర్తయిందని, అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని జేసీ హెచ్చరించారు. - 8లో

న్యూస్‌రీల్

అరుణాచలేశ్వరుని సేవలో మంత్రి రోజా



అరుణాచలేశ్వర స్వామి ఆలయంలో మంత్రి రోజా

నగరి : తమిళనాడులోని తిరువణ్ణామలైలో కొలువైన అరుణాచలేశ్వరుని మంత్రి ఆర్‌కే రోజా సోమవారం సేవించుకున్నారు. గిరిప్రదక్షిణ చేసిన అనంతరం ఆమె స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు మంత్రికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ భగవంతుని ఆశీస్సులు, ప్రజల దీవెనలు జగనన్నకు మెండుగా ఉన్నాయని, మళ్లీ ఆయన ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. అలాగే నగరి ఎమ్మెల్యేగా మూడో పర్యాయం విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలకు మరింత సేవ చేస్తానని వెల్లడించారు. నగరిలో నాలుగేళ్లుగా కొందరు కోవర్టులు కుట్రలు పన్నారని, తనపై దుష్ప్రచారం చేశారని మండిపడ్డారు. అభివృద్ధే లక్ష్యంగా తాను పనిచేశానని, జనం తనకు అండగా నిలిచారని తెలిపారు. ప్రజల వెన్నుదన్నుతో హ్యాట్రిక్ సాధించడం ఖాయమన్నారు. జూన్ 9వ తేదీన ముఖ్యమంత్రిగా జగనన్న ప్రమాణస్వీకారం చేస్తారని స్పష్టం చేశారు.

కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు



సూచనలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు జిల్లా యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. జూన్ 4వ తేదీ నిర్వహించే కౌంటింగ్ ప్రక్రియకు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం సన్నాహాలు చేస్తోంది. ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్, చిత్తూరు అసెంబ్లీ ఆర్‌ఓ శ్రీనివాసులు పర్యవేక్షిస్తున్నారు. చిత్తూరు నుంచి తిరుపతికి వెళ్లే దారిలో మురకంబట్టు దాటుకుని ఆర్‌వీఎస్ నగర్ వద్ద ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. చిత్తూరు పార్లమెంట్ కౌంటింగ్‌కు 14, ఒక్కొక్క అసెంబ్లీ లో ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్లు, రెండు హాళ్లను, చిత్తూరు పార్లమెంట్ పోస్టల్ బ్యాలెట్ ఓట్లకు ప్రత్యేకంగా 7 టేబుళ్లను, ఒక్కొక్క అసెంబ్లీ నియోజకవర్గం ఒక్కో టేబుల్ చొప్పున 7 టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నారు.

ఆర్‌డీఎస్‌ఎస్ పనులపై సమీక్ష

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో డిస్కం పరిధిలో జరుగుతున్న ఆర్‌డీఎస్‌ఎస్ (వ్యవసాయానికి ప్రత్యేక ఫీడర్ల ద్వారా విద్యుత్ సరఫరా) పనుల పురోగతిని సీఎండీ సంతోష్‌రావు సమీక్షించారు. సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎస్‌ఈ, ఈఈలతో సమావేశమయ్యారు. వచ్చే ఏడాది మార్చిలోపు ఆర్‌డీఎస్‌ఎస్ పనులు పూర్తి కావాలని ఆదేశించారు. దీంతో వ్యవసాయానికి మెరుగైన విద్యుత్ సరఫరా, గ్రామాలకు త్రీఫేజ్ కరెంటు ఇవ్వవచ్చన్నారు. సీజీఎం అయూబ్‌ఖాన్ మాట్లాడుతూ తిరుపతి సర్కిల్ పరిధిలో 893 వ్యవసాయ ఫీడర్లు ఉన్నాయని తెలిపారు. చిత్తూరు అర్బన్ డివిజన్ పరిధిలో రెడ్డిగుంట, కొత్తపల్లె, జీడీనెల్లూరు ప్రాంతాల్లో లైన్‌లాగి విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశామని ఈఈ పద్మనాభపిళ్లై వెల్లడించారు. సమావేశంలో రూరల్ ఈఈ హరి పాల్గొన్నారు.

జడ్జిలకు శిక్షణా తరగతులు



ప్రసంగిస్తున్న జడ్జి రామ్‌గోపాల్

తిరుపతి లీగల్: రాయలసీమ జిల్లాలోని 30 మంది న్యాయమూర్తులకు సోమవారం శ్వేతభవన్‌లో శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. తిరుపతి ఐదో అదనపు జిల్లా జడ్జి, ఇన్‌చార్జ్ ఉమ్మడి చిత్తూరు జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవా సంస్థ చైర్మన్ జీ.రామ్‌గోపాల్ ఈ శిక్షణా తరగతులను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మధ్యవర్తిత్వం, ఇతర అంశాలపై న్యాయమూర్తులకు అవగాహన కల్పించారు. జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి ఎస్‌పీడీ.వెన్నెల, ట్రైనర్లు సుదర్శన్ సుందర్ ప్రసాద్, సుబ్బన్నలు పాల్గొని వివిధ అంశాలపై ప్రసంగించారు. కార్యక్రమాన్ని ఉమ్మడి చిత్తూరు జిల్లా న్యాయ సేవాసంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు.

గంగమ్మా..మమ్మేలు మాయమ్మా!



తిరుపతి తాతయ్యగుంట ఆలయానికి పోటెత్తిన భక్తజనం (ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

'గంగమ్మా.. మమ్మేలు మాయమ్మా.. కరుణించు కాపాడు తల్లీ..' అంటూ భక్తులు ప్రణమిల్లారు. కోరిన కోర్కేలు తీర్చే కల్పవల్లిని చూసి తరించారు. సంప్రదాయ బద్ధంగా వేషాలు వేసి, అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సోమవారం కైకాల కులస్థులు సున్నపు కుండల వేషాలు వేసి నగర వీధుల్లో విహరిస్తూ స్థానికుల చేత పూజలందుకున్నారు. పలువురు భక్తులు పౌరాణిక, జానపద వేషాలు వేసి, డప్పుదరువులకు చిందులేస్తూ సందడి చేశారు. ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుటుంబ సభ్యులు, తిరుపతి నగర మేయర్ దంపతులు అమ్మవారికి సారె సమర్పించారు. సోమవారం అర్ధరాత్రి మంగళ ద్రవ్యాలతో అమ్మవారికి అభిషేకం చేశారు. – తిరుపతి కల్చరల్



తాతయ్యగుంట గంగమ్మకు సారను తీసుకు వస్తున్న మేయర్ డాక్టర్ శిరీష దంపతులు, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్



గంగమ్మతల్లికి సారె సమర్పిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి కుటుంబ సభ్యులు

స్నేహం.. సేవామార్గం

సమాజం పట్ల బాధ్యత.. ఉన్నత చదువుకు సార్థకత.. మనసులు కలిపిన భావసారూప్యత.. ఇంజినీరింగ్ విద్యను అభ్యసించిన ఐదుగురు స్నేహితులను సేవా మార్గంలోకి తీసుకెళ్లింది. ఉత్తమ ఆశయంతో వారి మదిలో పురుడు పోసుకున్న ఒక్క ఆలోచన వందలాది మందిని ప్రభావితం చేస్తోంది. 'పుత్తూరు జట్టుగా' విశేష సేవలందిస్తూ వేల సంఖ్యలో ఫాలోవర్లను సమకూర్చింది. ఆ మిత్రబృందానికి చక్కటి గుర్తింపు తెచ్చిపెట్టింది.



మన పుత్తూరు టీమ్ మెంబర్స్

- ఇంజినీరింగ్ చదువులకు సార్థకత చేకూరుస్తూ..
- చేయీచేయీ కలిపిన ఐదుగురు మిత్రుల బృందం
- నేడు వేల సంఖ్యలో ఫాలోవర్లతో ప్రత్యేక గుర్తింపు
- 'మన పుత్తూరు' జట్టుగా విశేష సేవలు

మన పుత్తూరు లోగో

పుత్తూరు : ఐదుగురు స్నేహితుల ఆలోచన నుంచి పుట్టిందే 'మన పుత్తూరు జట్టు' సేవా సంఘం. ఇంజినీరింగ్ చదువుతుండగానే వారి ఆలోచనలు సేవా కార్యక్రమాల చుట్టూ పరిభ్రమించాయి. వీరి ఆశయాలకు 2018లో నాంది పడింది. ముందుగా వారు తమ ఆలోచనలను పుత్తూరు పట్టణంలోని మరి కొంతమందితో పంచుకొన్నారు. అందరూ చేతులు కలిపారు. నాటి నుంచి నేటి వరకు నిర్విరామంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తమ సంఘం తరఫున చేపట్టిన పనులను ఇన్‌స్టాగామ్‌లో పోస్ట్ చేశారు. ప్రస్తుతం వీరికి 26 వేల మంది ఫాలోవర్స్ ఉన్నారు. సేవా కార్యక్రమాలను నిర్వహించే ఓ సంఘానికి వేల సంఖ్యలో ఫాలోవర్స్ ఉండడం విశేషం. మన పుత్తూరు పేరిట ఓ పిలుపునిస్తే పదుల సంఖ్యలో యువకులు కదలివచ్చి కార్యక్రమం విజయవంతానికి తమ వంతు సహకారం అందిస్తున్నారు. దీంతో రెట్టించిన ఉత్సాహంతో మన పుత్తూరు సంఘం సభ్యులు ముమ్మరంగా సేవలు అందిస్తున్నారు. వాటిలో మచ్చుకు కొన్ని..

- ఓటు హక్కు వినియోగంపై వీడియోలు తీసి గ్రామీణులకు అవగాహన కల్పించారు.
- చిన్న చిన్న సమస్యలకు అధికారులపై ఆధారపడే పరిస్థితి లేకుండా స్వయంగా తామే రంగంలోకి దిగి పరిష్కరించారు.
- పుత్తూరు పట్టణంలో విశేషంగా నిర్వహించే శ్రీధర్మరాజస్వామి తిరునాళ్లల్లో సేవా కార్యక్రమాలు చేశారు.
- పుత్తూరు పట్టణం ప్రత్యేకతలు తెలుపుతూ, చుట్టు పక్కల ఉన్న జలపాతాలు, ఇతర ప్రత్యేకతలను డ్రోన్ కెమెరా ద్వారా చిత్రీకరించి సోషల్ మీడియాలో ప్రచారం చేశారు.
- కోవిడ్ సమయంలోనూ ప్రతిరోజూ సమాచారాన్ని న్యూస్ వీడియోల ద్వారా ప్రజలకు – తెలియజేశారు.
- యూ ట్యూబ్ చానెల్‌లో పుత్తూరు మేధ అనే పాటను చిత్రీకరించి పోస్ట్ చేయడంతో బాగా వైరల్ – అయ్యింది.
- ప్రతిరోజూ రాత్రి 7 గంటలకు 7 హెడ్‌లైన్స్ ద్వారా వార్తలను స్థానికులకు తెలియజేస్తున్నారు.



చెత్త సేకరిస్తున్న సభ్యులు

'మూలకోన' పరిరక్షణ

పుత్తూరు మండలంలోని మూలకోన పర్యాటకులకు నెలవు. వారాంతాల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులే కాకుండా తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో ఇక్కడికి వస్తుంటారు. దీంతో ఇక్కడ పరిశుభ్రత తలకు మించిన భారంగా తయారైంది. ఈ విషయాన్ని గుర్తించిన మన పుత్తూరు సభ్యులు 40 మంది మూలకోనకు చేరుకొని గత కొన్నేళ్లుగా పారిశుద్ధ్యం మెరుగునకు చర్యలు చేపడుతున్నారు. రోజూ పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తున్నారు. రాళ్లు, రప్పల మధ్య, ఆలయ ప్రాంగణంలోని కోనేరు, కొండపైన జలపాతం వద్ద 24 గంటల పాటు శ్రమించి ఈ ఆదివారం ఒక్కరోజే 130 బస్తాల వ్యర్థాలను తొలగించారు. వీరి కష్టానికి ఫలితంగా మూలకోన చాలా కాలం తర్వాత పరిశుభ్రతను సంతరించుకుంది.



మూలకోన కోనేరులో వల సహాయంతో చెత్త సేకరణ



చెత్త బస్తాలతో పుత్తూరు టీమ్ సభ్యులు



రోడ్డు డివైడర్‌ను ఏర్పాటు చేస్తూ..

సామాజిక సేవే లక్ష్యం



"మన పుత్తూరు పేరిట సామాజిక సేవలను విస్తృతం చేయడమే మా లక్ష్యం. మన పుత్తూరు టీమ్‌ను నా మిత్రులు పవన్‌కుమార్, సాయిగౌతమ్, కల్యాణ్ కుమార్, కృష్ణచైతన్యలతో కలిసి నడిపిస్తున్నా. అందరం ఇంజినీరింగ్ చదివేప్పుడు మిత్రులమయ్యాం. ప్రస్తుతం ఉద్యోగాలు చేస్తున్నా మన పుత్తూరుకు తగిన సమయం కేటాయిస్తున్నాం. పలానా చోట మీ సేవ అవసరం అని మా దృష్టికి తీసుకు వస్తే తప్పకుండా మావంతు పనిచేస్తాం. ఇందుకు మా టీమ్ అన్ని వేళలా సిద్ధం. ప్రధానంగా పుత్తూరు గురించి గుగూల్ మ్యాప్స్, నెట్‌లోనే కాకుండా మా ఇన్‌స్టాగ్రామ్ పేజీ చూస్తే ఇక్కడి ప్రత్యేకతలు తెలిసేలా ప్రయత్నిస్తున్నాం."

– గిరీష్ కుమార్, మన పుత్తూరు టీమ్ అడ్మిన్



ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరిస్తున్న సభ్యులు

రాయితీ విత్తనాలు రెడీ

ఖరీఫ్ సీజన్‌లో సాగుకు అవసరమైన వేరుశనగ విత్తన కాయలను ప్రభుత్వం సిద్ధం చేసింది. రైతులకు పంపిణీ చేసేందుకు అవసరమైన కాయలను ఆయా గ్రామాల రైతు భరోసా కేంద్రాలకు చేర్చింది. రాయితీపై వీటిని అన్నదాతలకు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టింది. వేరుశనగ విత్తన కాయలు కావల్సిన వారు ముందుగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించింది. అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా ప్రక్రియ పూర్తి చేసేందుకు వ్యవసాయశాఖ పటిష్టమైన చర్యలు తీసుకుంది.

- 23 నుంచి వేరుశనగ కాయల పంపిణీ
- కిలోకు 40 శాతం సబ్సిడీ
- బస్తా ధర రూ. 1,710
- జిల్లాకు 38,655 క్వింటాళ్ల కేటాయింపు



రైతు భరోసా కేంద్రంలో పంపిణీకి సిద్ధంగా వేరుశనగ విత్తనకాయలు

చిత్తూరు అగ్రికల్చర్: జిల్లాలోని రైతులు ఏటా ఖరీఫ్‌లో వర్షాధార పంటగా వేరుశనగను సాగు చేస్తుంటారు. ఈ సీజన్‌లో కూడా మొత్తం 43,174 హెక్టార్ల సాధారణ విస్తీర్ణంలో వేరుశనగను సాగు చేస్తారని అధికారులు అంచనా వేశారు. ఈ క్రమంలో రబీ సీజన్‌లో పండించిన వేరుశనగ కాయలను రైతుల నుంచి ప్రభుత్వమే కొనుగోలు చేసింది. సేకరించిన కాయలను శుద్ధి చేసి రాయితీపై అన్నదాతలకు అందించేందుకు చర్యలు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 38,655 క్వింటాళ్ల కాయలను ఆయా గ్రామాల రైతు భరోసా కేంద్రాల్లో పంపిణీ చేసేందుకు సరఫరా చేసింది. ఈ నెల 23వ తేది నుంచి విత్తనాలను రైతులకు అందించేందుకు చర్యలు తీసుకుంది. ఇందుకుగాను కాయలు కావల్సిన రైతులు ఆయా రైతు భరోసా కేంద్రంలో ముందస్తుగా నమోదు చేసుకోవాలని తెలియజేసింది.

సబ్సిడీతో సరఫరా

రైతులకు 40 శాతం రాయితీపై వేరుశనగ విత్తన కాయలను అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో కే6 రకం కాయలు క్వింటాల్‌కు రూ. 9,500 ధర నిర్ణయించగా , 40 శాతం రాయితీ కింద రూ.3,800 పోను రూ.5,700 చొప్పున ధర నిర్ణయించింది. అదేవిధంగా నారాయణి రకం కాయలు క్వింటాల్ రూ.9,700 ధర నిర్ణయించగా , 40 శాతం రాయితీ కింద రూ. 3,880 పోను రూ. 5,820 మేరకు ధర నిర్ణయించింది. దీంతో కె6 రకం బస్తా (30 కేజీలు) రూ. 1,710 , నారాయణి రకం బస్తా (30 కేజీలు) రూ. 1,746 చొప్పున చెల్లించి రైతులు కొనుగోలు చేసుకోవాల్సి ఉంటుంది.

పకడ్బందీగా పంపిణీ



"రైతులకు రాయితీ విత్తన కాయలను పకడ్బందీగా పంపిణీ చేస్తాం. ఇప్పటికే జిల్లాకు చేరిన విత్తన కాయలను ఆయా గ్రామాల రైతు భరోసా కేంద్రాలకు చేర్చాం. ఎలాంటి అవకతవకలకు తావులేకుండా అందరికీ విత్తనాలు అందించేందుకు కట్టుదిట్టంగా చర్యలు తీసుకున్నాం." – మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

23న వైశాఖి పౌర్ణమి గరుడసేవ

తిరుమల: తిరుమలలో మే 23న వైశాఖ పౌర్ణమి గరుడసేవ వైభవంగా నిర్వహించనున్నారు. ప్రతినెలా పౌర్ణమి సందర్భంగా తిరుమలలో గరుడసేవ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రాత్రి 7 నుంచి 9 గంటల వరకు సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామివారు గరుడ వాహనంపై అధిష్ఠించి ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించనున్నారు.

క్లుప్తంగా

వైఎస్‌ఆర్‌ సీపీ నుంచి ఎంఆర్‌సీ రెడ్డి సస్పెన్షన్‌



తిరుపతి రూరల్‌: వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎంఆర్‌సీ రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్‌ చేసినట్టు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. పార్టీ అధినేత, సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గానికి చెందిన ఎంఆర్‌సీ రెడ్డిపై చర్యలు తీసుకున్నట్లు తెలిపింది. ఆయన పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు వ్యతిరేకంగా, ప్రత్యర్థి పార్టీ నాయకులకు అనుకూలంగా పనిచేశారన్న ఆరోపణలతో విచారణ జరిపి క్రమశిక్షణ కమిటీ సిఫార్సుల మేరకు సస్పెండ్‌ చేసినట్లు ప్రకటించింది.

నడకమార్గంలో చిరుతల కలకలం

తిరుమల: అలిపిరి నడక మార్గంలోని ఆఖరి మెట్టు వద్ద రెండు చిరుత పులులు కలకలం సృష్టించాయి. సోమవారం నడక మార్గంలో తిరుమలకు వెళ్తున్న కేరళకు చెందిన భక్తులకు చిరుత పులులు కనిపించాయి. వెంటనే అక్కడి భక్తులు పెద్ద ఎత్తున కేకలు వేయడంతో చిరుతలు అడవిలోకి పారిపోయాయి. విషయం తెలుసుకున్న టీటీడీ విజిలెన్స్‌, అటవీశాఖ అధికారులు చిరుతల జాడను గుర్తించేపనిలో పడ్డారు. అయితే టీటీడీ ఇప్పటికే అలిపిరి మార్గంలో చిరుతలు రాకుండా కావలసిన అన్ని చర్యలను చేపట్టింది. భక్తులు గుంపులుగా వెళ్లడం వల్లే అవి అడవిలోకి పారిపోయి ఉంటాయని అధికారులు భావిస్తున్నారు.

‘ఉపాధి’.. పేదల పెన్నిధి

జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులు ఊపందుకున్నాయి. ఏప్రిల్‌ 1 నుంచి జూన్‌ 30వ తేదీ వరకు వ్యవసాయ పనులకు విరామం ఉండడంతో ప్రస్తుతం ఇవే గ్రామీణ కూలీలకు కల్పతరువుగా మారాయి. జాబ్‌కార్డులు ఉన్న ప్రతి ఒక్కరికీ పని దొరుకుతోంది. సకాలంలో వేతన బకాయిలు అందుతుండడంతో ఉపాధి పనులకు హాజరయ్యే కూలీల సంఖ్య రెట్టింపయ్యింది. అవినీతికి తావులేకుండా వేతన చెల్లింపులు నేరుగా తమ ఖాతాల్లోనే జమచేస్తుండడంతో కూలీలు సంతోషం వ్యక్తం చేస్తునానరు. క్లస్టర్‌ ఏపీడీలతోఆపటు క్షేత్రస్థాయి సిబ్బంది సైతం నిత్యం అందుబాటులో ఉంటున్నారు. పనుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

- జిల్లాలో జోరుగా ఉపాధిహామీ పనులు
- ఇతర రాష్ట్రాలకు తగ్గిన వలసలు
- స్థానికంగానే పని కల్పిస్తున్న ప్రభుత్వం
- అక్రమాలకు ఆస్కారం లేకుండా కూలి పంపిణీ

చిత్తూరు కలెక్టరేట్‌ : మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద జిల్లాలోని కూలీలకు స్థానికంగానే పని దొరుకుతోంది. పనుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా సొంత గ్రామంలో కూలి చేసుకునేలా చేయూతనిస్తోంది. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్క కుటుంబానికి వంద రోజుల పని కల్పించాలనే లక్ష్యంతో జిల్లా యంత్రాంగం ఏటా ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేసుకుని ముందుకు సాగుతోంది. ఈ పథకంతో గ్రామీణ ప్రజలు లబ్ధి పొందడమే కాకుండా గ్రామీణాభివృద్ధి జరుగుతోంది.



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్‌)



క్షేత్రస్థాయిలో కూలీల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న డ్వామా పీడీ రాజశేఖర్‌ (ఫైల్‌)

ఇప్పటికే 13.17 లక్షల పనిదినాల పూర్తి

జిల్లా వ్యాప్తంగా 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను 45 లక్షల పనిదినాలను లక్ష్యంగా నిర్దేశించారు. ఇప్పటివరకు జిల్లాలో 13.17 లక్షల పనిదినాలను పూర్తిచేశారు. మిగిలిన వాటిని ప్రణాళిక ప్రకారం పూర్తిచేసేలా చర్యలు చేపడుతున్నారు. జిల్లాలో కూలీలకు గరిష్ట వేతనంగా రూ.300 చెల్లిస్తున్నారు.

రూ.7.20 కోట్ల చెల్లింపు

జిల్లాలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకూ జరిగిన 13.17 లక్షల పనిదినాలకు గాను రూ.7.20 కోట్లను ప్రభుత్వం చెల్లించింది. భూగర్భ జలాలు పెంచడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం మూడు నెలల క్రితం గ్రామసభలు నిర్వహించి అక్కడ పనులకు ఆమోదం తెలిపింది. అమృత్‌ సరోవర్‌ పథకంలో భాగంగా చెరువుల సుందరీకరణ, ఖరీఫ్‌లో వ్యవసాయ పనులు మొదలు కానుండడంతో పంట కాలువల శుభ్రం, చెక్‌డ్యామ్‌ల్లో పూడికతీత లాంటి పనులకు పెద్దపీటవేస్తున్నారు.

పారదర్శకంగా..

ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు తావులేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. నేషనల్‌ మొబైల్‌ మానిటరింగ్‌ సిస్టమ్‌ (ఎన్‌ఎంఎంఎస్‌) ద్వారా కూలీలకు హాజరు వేస్తున్నారు. గతంలో మాన్యువల్‌గా వేస్తుండడం వల్ల బోగస్‌ హాజరు ఉన్నట్లు విమర్శలు వెల్లువెత్తాయి. ప్రస్తుతం అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా ఎన్‌ఎంఎంఎస్‌ యాప్‌లో రోజుకు రెండుసార్లు హాజరుతో పాటు ఫొటోలు తీసి అప్‌లోడ్‌ చేస్తున్నారు.

నిత్యం పర్యవేక్షణ



క్షేత్రస్థాయిలో ఉపాధి పనులను నిత్యం పర్యవేక్షిస్తున్నాం. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్క కుటుంబానికి పని కల్పిస్తున్నాం. కూలీలకు వేతనాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నాం. జిల్లాలో వలసలు అనే మాట వినిపించకుండా పకడ్బందీగా చర్యలు చేపడుతున్నాం.

– రాజశేఖర్‌, డ్వామా పీడీ

గాలివానతో అప్రమత్తం

- చెట్ల కింద తలదాచుకోకపోవడం ఉత్తమం
- ఎలక్ట్రానిక్‌ వస్తువులు వాడకపోవడం శ్రేయస్కరం



గాలివాన కారణంగా చిత్తూరులో పడిపోయిన చెట్టు (ఫైల్‌)

చిత్తూరు కార్పొరేషన్‌ : గాలివాన సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వీలైనంత వరకు బయటకు రాకపోవడం మంచిదని వాతావరణ నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా వ్యవసాయ పనులకు వెళ్లే కూలీలు, రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు. వర్షం కురిసే సమయంలో పిడుగులు పడే అవకాశముందని, చెట్ల కింద తలదాచుకోవడం ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో వర్షాలు కురుస్తున్నందున, పలు ప్రాంతాల్లో గంగమ్మ జాతరలు నిర్వహిస్తున్నందున జనం మరింత అప్రమత్తంగా ఉండాలని కోరారు. గాలివాన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు.

- చిన్నపాటి వర్షం కురవడం ప్రారంభమైనప్పుడే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలి
- ఉరుములు మెరుపులు వస్తున్న సమయంలో ఎత్తైన ప్రదేశాలు, చెట్లు కింద ఉండకూడదు
- పిడుగులు పడే సమయంలో ల్యాండ్‌లైన్‌ ఫోన్‌లో మాట్లాడకూడదు
- ఇంట్లోని స్విచ్‌ బోర్డుల నుంచి ప్లగ్‌లు తీసి వేయాలి
- టీవీలు చూడకపోవడం మంచిది
- విద్యుత్‌ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్ల సమీపంలో ఉండకూడదు
- ఉరుములు, మెరుపుల సమయంలో మన శరీరం జలదరింపునకు గురవ్వడం, రోమాంఛితం కావడం వంటి సంకేతాలు వస్తే సమీపంలోనే పిడుగు పడబోతున్నట్లు గుర్తించాలి

ఏనుగు దాడిలో పంటల ధ్వంసం

బైరెడ్డిపల్లె : మండలంలోని కడపనత్తం, పాతపేట, కుప్పనపల్లె గ్రామాలోని వ్యవసాయ పొలాలపై ఆదివారం రాత్రి ఏనుగుల గుంపు దాడి చేసి పంటలను ధ్వంసం చేసింది. షామీమ్‌ అనే రైతు సాగు చేసిన అరటి, మామిడి చెట్లను తొక్కి నాశనం చేసింది. నాగేంద్ర అనే రైతుకు చెందిన పొలానికి వేసిన ఫెన్సింగ్‌, రాతి బండలు, ఇనుపగేటును విరిచేసింది. శివలింగం అనే రైతు సాగు చేసిన రాగిపంట, భాస్కర్‌ సాగు చేసిన టమాట పంటలను నాశనం చేసింది. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారి కుసుమ పంటలను పరిశీలించారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

నగరి : అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని జాయింట్‌ కలెక్టర్‌ శ్రీనివాసులు హెచ్చరించారు. సోమవారం మండలంలోని ఓజీ కుప్పం ఇసుక రీచ్‌ను ఆయన పరిశీలించారు. ఈరీచ్‌కు అనుమతి గడువు పూర్తయినా ఇప్పటికీ ఇసుక రవాణా జరుగుతుంటే ఏం చేస్తున్నారని అధికారులపై మండిపడ్డారు. వెంటనే ఇక్కడ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేయాలని స్పష్టం చేశారు. అలాగే సమీప గ్రామాల్లో సైతం ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని టామ్‌ టామ్‌ వేయించాలని సూచించారు. జిల్లాలో ప్రభుత్వం గుర్తించిన 14 ఇసుక రీచ్‌లను భూగర్భ గనులు శాఖ జిల్లా అధికారులు, పొల్యూషన్‌ కంట్రోల్‌ బోర్డు, సెబ్‌, ఎక్సైజ్‌, గ్రౌండ్‌ వాటర్‌, ఇరిగేషన్‌, రవాణా శాఖల అధికారులతో కలసి పరిశీలించామన్నారు. వీటన్నింటికీ అనుమతి గడువు పూర్తయిందని, ఇకపై ఎక్కడా ఇసుక రవాణా జరగకూడదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ, సెబ్‌ ఇన్‌చార్జి సుబ్బరాజు, భూగర్భ గనుల శాఖ అధికారి ప్రసాద్‌, పొల్యూషన్‌ కంట్రోల్‌ బోర్డు ఏఈఈ మదన్‌మోహన్‌, డీపీఓ లక్ష్మి, తహసీల్దార్‌ చంద్రశేఖర్‌ రెడ్డి పాల్గొన్నారు.



ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న జాయింట్‌ కలెక్టర్‌ శ్రీనివాసులు

బెంగళూరు ‘రేవ్‌పార్టీ’లో చిత్తూరు వాసులు?

చిత్తూరు అర్బన్‌: కర్ణాటకలోని బెంగళూరులో ఆదివారం రాత్రి జరిగిన రేవ్‌పార్టీలో చిత్తూరుకు చెందిన యువకులు సైతం పట్టుబడినట్లు తెలుస్తోంది. ఆదివారం అర్ధరాత్రి హైదరాబాద్‌కు చెందిన వాసు అనే వ్యక్తి తన పుట్టినరోజు వేడుకలను బెంగళూరు శివారుల్లోని ఓ వ్యాపారికి చెందిన ఫామ్‌హౌస్‌లో నిర్వహించాడు. ఈ పార్టీలో నిషేధిత మాదక ద్రవ్యాలు ఉపయోగిస్తున్నట్లు సమాచారం అందుకున్న సీసీబీ పోలీసులు దాడి చేశారు. బెంగళూరు, ఏపీకి చెందిన వంద మందికిపైగా ప్రముఖులు రేవ్‌పార్టీలో పాల్గొన్నట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. ఈ దాడుల్లో పట్టుబడిన ఫార్చ్యూనర్‌ కారు గుడిపాల మండలానికి చెందిన ఓ టీడీపీ నాయకుడిదిగా తెలిసింది. త్యాగరాజులు నాయుడు (శ్రీకాంత్‌), గోపి నాయుడు అనే ఇద్దరు ఈ రేవ్‌పార్టీకు హాజరైనట్లు సమాచారం. వీళ్లతో పాటు ప్రసాద్‌ నాయుడు అనే మరో వ్యక్తి కూడా ఉన్నాడనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా గుడిపాలలో జరిగిన పోలింగ్‌లో వీళ్లు విచ్చలవిడిగా నగదు ఖర్చుచేసినట్లు తెలిసింది. పోలింగ్‌ అయిపోవడంతో రిలాక్స్‌ అయ్యేందుకు వీరు ఈ రేవ్‌పార్టీకి వెళ్లినట్లు తెలుస్తోంది. ఆ పార్టీలో వీళ్లు మాదక ద్రవ్యాలు తీసుకున్నారా..? లేదా..? అనే వివరాలు తెలుసుకోవడానికి పోలీసులు రక్తనమూనాలు సేకరించారు. వీళ్లతో పాటు చిత్తూరు నియోజకవర్గానికి చెందిన కీలక ‘పచ్చ’ నాయకుడు ఉన్నాడనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. విలాసవంత జీవనానికి అలవాటుపడిన ఈనేత రేవ్‌ పార్టీలో ఉన్నాడా..? మాదక ద్రవ్యాలు ఏమైనా తీసుకున్నాడా..? అనే దానిపై అటు బెంగళూరు సీసీబీ పోలీసులు, ఇటు చిత్తూరు పోలీసులు సైతం ఆరా తీస్తున్నట్లు సమాచారం.

చీర మెడకు చుట్టుకుని బాలిక మృతి



మృతి చెందిన మెమిన్‌

పులిచెర్ల(కల్లూరు): చీరను ఉయ్యాలగా చేసుకొని అందులో కూర్చుని ఊగుతూ ప్రమాదవశాత్తు మెడకు చుట్టుకోవడంతో ఓ బాలిక మృతి చెందింది. సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలు.. సదుం మండలం తిమ్మానాయునిపల్లెకు చెందిన మెమిన్‌ (9) తల్లిదండ్రులకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో తిరుపతిలోని ఓ ఆస్పత్రిలో చేరారు. దీంతో మెమిన్‌ను కల్లూరు దిగువవీధిలోని వాళ్ల అమ్మమ్మ ఇంటికి చేర్చారు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం చీర ఉయ్యాలలో ఊగుతుండగా ఆ గుడ్డ అనుకోకుండా మెడకు చుట్టుకోవడంతో ఊపిరి అందలేదు. కుటుంబీకులు వెంటనే స్పందించి హుటాహుటిన పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే బాలిక మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. తల్లి అయేషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవిప్రకాష్‌రెడ్డి తెలిపారు.

వైభవం.. అగ్నిగుండ ప్రవేశం



అగ్ని గుండ ప్రవేశం చేస్తున్న అమ్మవారు

కుప్పం : ప్రసన్న తిరుపతి గంగమ్మ జాతరలో భాగంగా సోమవారం రాత్రి ముత్తు మారెమ్మ అగ్ని గుండ ప్రవేశం వైభవంగా చేపట్టారు. జోరు వాన కురుస్తున్నా భక్తులు లెక్కచేయకుండా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ క్రమంలో ముందుగా తిరుపతి గంగమ్మ దేవాలయం నుంచి పల్లకిపై ఊరేగింపుగా ముత్తు మారెమ్మను అగ్నిగుండం వద్దకు తీసుకువచ్చారు. బాణ సంచా, ప్రత్యేక పూజల అనంతరం పచ్చ గెరిగ మొదట అగ్నిగుండ ప్రవేశం చేసింది. తర్వాత పూజారుల బృందం అమ్మవారిని అగ్ని గుండ ప్రవేశం చేయించారు. పెద్దసంఖ్యలో భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కుప్పం ఫలితంపై

సర్వత్రా ఉత్కంఠ

కుప్పం : వైఎస్సార్‌సీపీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కుప్పం నియోజకవర్గంలో ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ ఐదేళ్లలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే తమను విజయతీరాలకు చేరుస్తాయని వైఎస్సార్‌సీపీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పనితీరుపై ప్రజలు సంతృప్తిగా ఉండడం వల్లే ఓటేసేందుకు పోటెత్తారని విశ్లేషిస్తున్నారు. అందుకే ఎన్నడూలేనివిధంగా 89శాతానికి పైగా పోలింగ్‌ నమోదైందని వివరిస్తున్నారు. కుప్పం ఫలితంపై పొరుగు రాష్ట్రాల్లో స్థిరపడిన కుప్పంవాసులు సైతం బంధువులతో ఫోన్‌లో చర్చలు సాగిస్తున్నారు. 40 ఏళ్లుగా ఏకపక్షంగా ఎన్నికలు జరిగేవని, ఈ పర్యాయం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి భరత్‌ దీటుగా నిలబడ్డారని అభిప్రాయపడుతున్నారు. నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల లబ్ధి చేకూరిందని, అందుకే పార్టీలకు అతీతంగా ప్రజలు ఓటేసే అవకాశముందని వ్యాఖ్యానిస్తున్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండడం, ఆయన సతీమణి దుర్గ, తల్లి పద్మజ సైతం స్థానికులను ఆత్మీయంగా పలకరిస్తూ మమేకం కావడం కూడా వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా మారుతుందని వెల్లడిస్తున్నారు. ఈ పర్యాయం మహిళలు ఎక్కువగా పోలింగ్‌లో పాల్గొనడం కూడా ఫ్యాన్‌కు కలిసొస్తుందని చెబుతున్నారు. ఈ ఎన్నికల్లో చంద్రబాబు ఎదురుదెబ్బ తగిలే అవకాశముందని పలువురు టీడీపీ నేతలు గుసగుసలాడుకుంటున్నారు. ఈ క్రమంలో ఇరుపార్టీల నేతలు మండలాలవారీగా లెక్కలు వేసుకుంటున్నారు.

బాలికపై లైంగికదాడికి యత్నం

పుంగనూరు : పట్టణంలోని పదేళ్ల బాలికపై ఓ యువకుడు లైంగిక దాడికి యత్నించిన ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాలు.. పట్టణానికి చెందిన ఓకాంట్రాక్ట్‌ ఉద్యోగి కుమార్తె ఆదివారం ఉదయం ఇంటి ముందు ఆడుకుంటుండగా అదే ప్రాంతానికి చెందిన సుజయ్‌ (21) అనే యువకుడు ఆబాలికను బలవంతంగా తమ ఇంట్లోకి లాక్కెళ్లేందుకు ప్రయత్నించాడు. బాలిక కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు కాపాడారు. దీనిపై బాలిక తల్లిదండ్రులు యువకుని మందలించారు. ఇలా ఉండగా సాయంత్రం సుజయ్‌కుమార్‌, అతడి తల్లిదండ్రులు కలసి బాలిక తండ్రిపై దాడి చేసి గాయపరిచారు. దీనిపై బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు స్పందించలేదు.ఈ విషయం సోషల్‌ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో పోలీసులు హుటాహుటిన వెళ్లి బాలిక తండ్రితో మాట్లాడి కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.